శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు
# వార్త

## అపోలో ఆధ్వర్యంలో మారథాన్



**నెల్లూరు అక్టోబర్ 9, ప్రభాతవార్త-వైద్యం** ప్రపంచ ఆర్థరైటిస్ దినోత్సవం సందర్భంగా అపోలో ఆసుపత్రి ఆధ్వర్యంలో ఆర్థరైటిస్ వాక్థాన్‌ను నిర్వహించారు. ఆదివారం నగరంలోని చిల్డ్రన్స్ పార్కు నుంచి అపోలో ఆసుపత్రి వరకు ఈ వాక్తాన్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా జిల్లా అదనపు ఎస్పీ హైమావతి, జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి ఎం.పెంచలయ్య, ప్రముఖ ఆర్థో వైద్య నిపుణులు డాక్టర్ మదన్‌మోహన్‌రెడ్డిలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అపోలో స్పెషాలిటీ ఆసుపత్రిలో అందిస్తున్న ప్రత్యేక ప్యాకేజీ బ్రోచర్‌ని విడుదల చేశారు. అనంతరం ముఖ్యఅతిథులు మాట్లాడుతూ ప్రతి మనిషి నిత్య జీవితంలో నడక ఎంతో ముఖ్యమని పేర్కొన్నారు. తద్వారా ఎన్నో వ్యాధుల బారినపడకుండా ఉండవచ్చన్నారు. నడవడం వల్ల ఎముకలు, కీళ్ళకు సరైన వ్యాయామమని వారు సూచించారు. నడకతో మధుమేహాన్ని కూడా నియంత్రణలో ఉంచుకోవచ్చని తెలిపారు. నడక ఆర్యోగానికి ఎంతో దోహదపడుతుందన్నారు. అపోలోలో మోకాళ్ళకు సంబంధించి ఎంతో ఖరీదైన యూరిక్ యాసిడ్, సిబిసి, ఆర్‌బిసి, క్రియాటిన్, ఎక్స్‌రే పరీక్షలను కేవలం రూ.999లకే అందించడం సంతోషమని, దీనితోపాటు డాక్టర్ కన్సల్టేషన్ కూడా ఉచితంగా అందిస్తున్నట్లు అపోలో వర్గాలు వెల్లడించాయి. ఈ వాక్థాన్‌లో అపోలో సదరన్ రీజియన్ వైస్ ప్రెసిడెంట్ నవీన్, మెడికల్ సూపరింటెండెంట్ శ్రీరామ్‌సతీష్, డాక్టర్ బిందుమీనన్, డాక్టర్ వివేకానందరెడ్డి, డాక్టర్ శశిధర్‌రెడ్డి, ఐఎంఏ ప్రతినిధులు డాక్టర్ మల్లిఖార్జున్, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ వెంకటరమణ పాల్గొన్నారు.

## రూ 30 వేల గంజాయి పట్టివేత



**కావలి, అక్టోబరు 9 ప్రభాతవార్త** చట్టవిరుద్దంగా, అక్రమంగా గంజాయి అమ్మకాలు సాగిస్తున్న ఇద్దరు వ్యక్తుల్ని అరెస్ట్ చేసి 30 వేల రూపాయల విలువ కల్గిన మూడు కేజిల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు కావలి టు టౌన్ సర్కిల్ ఇన్స్‌పెక్టర్ ఎ.సుధాకర్ తెలిపారు. కావలి టు టౌన్ సర్కిల్ కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. కావలి పట్టణ ఉదయగిరి రోడ్డులో డిఆర్ ప్లాట్స్ వద్ద గంజాయి అమ్ముతున్న ఇద్దరు వ్యక్తుల్ని తమ పోలీస్ సిబ్బంది చాకచక్యంగా పట్టుకోవడం జరిగిందన్నారు. సర్వాయపాళెంకు చెందిన యుగనేష్‌రెడ్డి, కావలికి చెందిన సుమంత్‌లను అరెస్ట్ చేయడం జరిగిందన్నారు.వాయునందన ప్రెస్ వీధికి చెందిన సునీల్‌రెడ్డి పరారులో వున్నారన్నారు. అతనిని కూడా త్వరలో అరెస్ట్ చేస్తామన్నారు. జిల్లా ఎస్పీ విజయరావు ఆదేశాల మేరకు కావలి ఇన్‌చార్జ్ డిఎస్పీ కె.శ్రీనివాసులు పర్యవేక్షణలో ఈ దాడులు నిర్వహించామన్నారు. గంజాయి అక్రమ రవాణాదారులపై కఠిన చర్యలు గైకొనడం జరుగుతుందని ఆయన తీవ్ర స్థాయిలో హెచ్చరికలు చేశారు.ఈ దాడులలో టు టౌన్ ఎస్ఐ వెంకటేశ్వరరావు, పోలీస్ సిబ్బంది ఎస్.కె.రియాజ్, వేణు, ప్రేమ్‌లు పాల్గొన్నారని సిఐ సుధాకర్ తెలిపారు.

## కృత్రిమ అవయవ మార్పిడి పూర్తి



**నెల్లూరు అక్టోబర్ 9, ప్రభాతవార్త-వైద్యం** రెడ్‌క్రాస్‌లో గతంలో దివ్యాంగులు 400మందికి కృత్రిమ అవయవాల మార్పిడికి కొలతలు తీసుకున్న సంగతి తెలిసిందే. సెప్టెంబర్ నెలలో తొలివిడతగా జైపూర్ సంస్థ, ఇండియన్ రెడ్‌క్రాస్ నెల్లూరు శాఖ సంయుక్త ఆధ్వర్యంలో అందులో 200 మందికి ఉచితంగా కృత్రిమ కాళ్ళు, చేతులు మార్చడం జరిగింది. శనివారం 100మందికి, మిగిలిన 100 మందికి ఆదివారం కాళ్ళు, చేతులు మార్చి అవయవ మార్పిడి కార్యక్రమాన్ని పూర్తి చేశారు. ఈ సందర్భంగా జైపూర్ సంస్థ వారు మాట్లాడుతూ మునుముందు కూడా ఇలాంటి కార్యక్రమాలు రెడ్‌క్రాస్ సంస్థతో కలిసి చేపడతామని వెల్లడించారు. అనంతరం జైపూర్ సంస్థ నుండి వచ్చిన వారిని రెడ్‌క్రాస్ సొసైటీ తరపున వారు చేసిన సేవలకు సన్మానించారు. ఈ కార్యక్రమంలో రెడ్‌క్రాస్ కోశాధికారి సురేశ్‌కుమార్, మేనేజింగ్ కమిటీ సభ్యులు దాసరి.రాజేంద్రప్రసాద్, యడవల్లి.సురేష్, గునపాటి.ప్రసాద్‌రెడ్డి, కన్వీనర్లు సిహెచ్.అజయ్‌బాబు, టి.భాస్కర్‌రెడ్డి, స్టేట్ కోఆర్డినేటర్ జివి.రమేష్‌కుమార్ రెడ్‌క్రాస్ సిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు.

## అంతర్‌జిల్లాల ఆర్చరీ ఛాంపియన్‌షిప్‌కు ఎంపికైన జిల్లా క్రీడాజట్లు



**నెల్లూరు,అక్టోబరు9 ప్రభాతవార్త-విద్య** ఈనెల17నుండి 19వ తేదీ వరకు పార్వతీపురంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో నిర్వహించనున్న 42వ జూనియర్స్ అంతర్‌జిల్లాల ఆర్చరీ ఛాంపియన్‌షిప్ లో పాల్గొనే జిల్లా క్రీడాజట్ల ఎంపికలను ఆదివారం నగరంలోని స్థానిక ఎసీసుబ్బారెడ్డి క్రీడామైదానంలో జిల్లా ఆర్చరీ ఆసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా అనేకమంది బాల, బాలికలు ఈ ఎంపికల్లో పాల్గొనగా ఉత్తమ ప్రతిభ కనపరిచిన వారిని జిల్లా జట్టుకు ఎంపిక చేయటం జరిగిందని అసోసియేషన్ అధ్యక్ష్యకార్యదర్శులు పల్లంరెడ్డి శ్రీహర్ష, పావురాల వేణులు తెలిపారు. ఇండియన్ రౌండ్ బాలుర విభాగానికి కె.తరుణేష్, డి.మనోజ్‌కుమార్, పి.రాజేష్, జి.లోకేష్,సిహెచ్.తనుష్‌వర్ధన్, పి.దుష్యంత్‌లు ఎంపికైయ్యారన్నారు. అలాగే బాలికల విభాగంలో డి.భాషిత, పి.హర్షిణి, ఎన్‌డివి అమూల్య, కె.యశ్విత, వై.దీత్యచంద్రికలు ఎంపికైయ్యారన్నారు. రికౌరీ రౌండ్ బాలుర విభాగానికి ఆర్.సాయిమౌర్య, వి.ఉజ్వల్ శ్రీనివాస్, బి.నూతన్,పి.మాధవన్, టి.వేధాంత్‌రెడ్డి, పి.శేషశ్రీవచవ లు ఎంపియ్యారని పేర్కొన్నారు. బాలికల విభాగంలో ఎ.వినూతి, ఆర్.జశ్వితారెడ్డి, ఎన్‌ఆర్.ప్రియాంక వైష్ణవిలు ఎంపికైయ్యారన్నారు. కాంపౌండ్‌రౌండ్‌ఎ బాలుర విభాగంలో కె.సూరజ్‌కుమార్ నాయుడు, వై.జి చంద్ర మహేష్, ఎం. వెంకటసుషాంత్‌లు ఎంపికైయ్యారన్నారు. జిల్లా జట్ల ఎంపికల్లో ఎంతో ప్రతిభ కనపరిచిన వీరు రాష్ట్రస్థాయి పోటీల్లో కూడా విజయం సాదిస్తారని ఆశాభావం వ్యక్తంచేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ కార్యదర్శి అరిగెల విజయ్‌కుమార్, వి.శ్రీనివాసులు, బివిఎస్ నరసింహరావు, భరద్వాజ్,సాయి కిరణ్, శివశంకర్, తదితరులు పాల్గొన్నారు.

## బారాషాహీద్ దర్గాలో ఏడాదిలోగా అభివృద్ధి పనులు పూర్తి



**నెల్లూరుటౌన్, అక్టోబరు9 ప్రభాతవార్త** బారాషాహీద్ దర్గాలో మసీదు తదితర అభివృద్ధి పనులు మంజూరయ్యాయని రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి తెలిపారు. ఆదివారం దర్గా ప్రాగణంలో రూ.15 కోట్ల అంచనాలతో నిర్మించనున్న వివిద అభివృద్ధి కార్యక్రమాలకు ఆయన శంకుస్థాసన చేసి శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ, దర్గా అభివృద్ధి పనులను నాణ్యతాప్రమాణాలతో వేగవంతంగా పూర్తిచేస్తామన్నారు. దర్గాలో అభివృద్ధి పనులకు పెద్దఎత్తున నిధులు విడుదల చేసిన ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. రూ.7.5కోట్లతో దేశానికే ఆదర్శంగా సర్వాంగసుందర మసీదు నిర్మాణం జరుగుతుందన్నారు. మరో రూ.7.5కోట్లతో ముస్లిం మతపెద్దల సమన్వయంతో అభివృద్ధి పనులు చేపట్టి పూర్తిచేస్తామన్నారు. వచ్చే ఏడాది రొట్టెల పండుగ నాటికి ముఖద్వారాలు, మసీదు తదితర అభివృద్ధి కార్యక్రమాలు దాదాపు పూర్తవుతాయన్న ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. నిధులు మంజూరు చేయించడమే తన పని అన్న ఆయన అభివృద్ధి పనులు అన్నీ ముస్లిం మనోభావాల మేరకు జరుగుతాయని వివరించారు. కేవలం ఎన్నికల వేళ మాత్రమే రాజకీయాలని, అభివృద్ధే అజెండాగా నిరంతరం పనిచేస్తానని హామి ఇచ్చారు. మిలాడినబి పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఈకార్యక్రమంలో మేయర్ స్రవంతి, వైకాపా రాష్ట్ర కార్యదర్శి కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి, కడప పీఠాధిపతి అరీపుల్లా హుస్సేన్, వక్ఫ్‌బోర్డు చైర్మెన్ ఖాదర్‌భాషా, నెల్లూరు ముస్తి అబ్దుల్ వాహబ్‌సాహెబ్, ఇమామ్‌ఒఖతీబ్ సయ్యద్ అబూబకర్, కమిషనర్ హరిత, కార్పోరేటర్ వాసంతి తదితరులు పాల్గొన్నారు. ముస్లిం సోదరులు అధికసంఖ్యలో హాజరయ్యారు. అధికారులు, వైకాపా నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ముందు వెళ్తున్న లారీని ఢీకొని లారీ డ్రైవర్ మృతి

**కావలి రూరల్, అక్టోబరు 9 ప్రభాతవార్త** ముందు వెళ్తున్న లారీ షడన్ బ్రేక్ వేయడంతో వెనుక వస్తున్న లారీ అతివేగంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో లారీ డ్రైవర్ కొమారే వెంకట్రావు (27) మృతి చెందాడు. బాపట్ల జిల్లా మార్టూరు మండలం వడ్డెరరాజుపాళెం గ్రామానికి చెందిన లారీ డ్రైవర్ కొమేరే వెంకట్రావు మార్టూరు నుండి మిర్చి లోడుతో చెన్నై కోయంబేడుకు బయలుదేరాడు.కావలి జాతీయ రహదారి తుమ్మలపెంట ఫైవోవర్ బ్రిడ్జిపై ముందు వెళ్తున్న లారీ డ్రైవర్ షడన్ బ్రేక్ వేశాడు. వెనుక వస్తున్న లారీ డ్రైవర్ వెంకట్రావు కంట్రోల్ చేయలేక ముందు వెళ్తున్న లారీని అతివేగంగా ఢీకొట్టాడు. రక్తగాయాలు కావడంతోఏరియా వైద్యశాలకు తరలించారు. డ్రైవర్ వెంకట్రావు మృతి చెందినట్లు డాక్టర్లు నిర్ధారించినట్లు పోలీసులు తెలిపారు.

# పౌరసరఫరాలసంస్థలో పక్కదారి పట్టిన నిధులు



### -ఆడిట్‌లో బయటపడుతున్న అవినీతి
### -ఆడిట్ అయిన రికార్డులు విజయవాడకు తరలింపు

**నెల్లూరు కలెక్టరేట్, అక్టోబరు 9 ప్రభాతవార్త** జిల్లా పౌరఫరాలసంస్థ కార్యాలయంలో భారీగా అవినీతి బయటపడుతోంది..ప్రభుత్వం తెల్లకార్డుదారులకు అందజేసే సరకులను కొనుగోలు చేసి రేషన్‌షాపులకు పంపాల్సిన ఈ సంస్థ అధికారులు అంతకన్నా ముఖ్యంగా ఏటా రైతుల నుండి ధాన్యం కొనుగోలు చేస్తున్న విషయం విదితమే. సరకుల కొనుగోలు..రేషన్‌షాపులకు సరఫరా సంగతి ఎలా వున్నా..ఈ సంస్ద ఏటా జరుపుతున్న ధాన్యం కొనుగోళ్ళ ప్రక్రియలో ఈ సంస్థ ఆరోపణలు ఎదుర్కొంటున్న విషయం విదితమే. ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియకు సంబంధించి కొనుగోలు కేంద్రాలకు రైస్‌మిల్లులను అనుసంధానం చేయడం..మిల్లర్ల నుండి బ్యాంక్ గ్యారెంటీలు తీసుకోవడం.. గోతాల పంపిణీ..లారీలు పంపడం..రైతుల నుండి కొనుగోలు చేసిన ధాన్యాన్ని రైస్‌మిల్లులకు పంపడం.. చివరగా రైతులకు డబ్బుల చెల్లింపు ఇలా ప్రతి విషయంలోనూ ప్రతి ఏటా పౌరసరఫరాలసంస్థ అధికారులు, సిబ్బంది ఆరోపణలు ఎదుర్కొంటుండడం ఆనవాయితీగా వస్తోంది. గోతాల కోసం..తర్వాత లారీల కోసం..తర్వాత రైస్‌మిల్లుల వద్ద అన్‌లోడింగ్ కోసం.చివరగా డబ్బుల కోసం రైతులు పౌరసరఫరాలసంస్థ జిల్లా కార్యాలయం వద్ద పడిగాపులు కాయడం పరిపాటైంది. పౌరసరఫరాలసంస్థ అధికారులు-మిల్లర్లు, దళారులు కుమ్మక్కై అన్నదాతలను దోచుకుంటున్నారన్న విమర్శలు ఏటా వినిపిస్తూనేవున్నాయి. రైతులు, రైతు సంఘాల నాయకులు పౌరసరఫరాలసంస్థ అధికారుల తీరుకు నిరసనగా ధర్నాలు చేస్తుండడం, స్పందన తదితరాలలో జిల్లా అధికారులకు ఫిర్యాదులు చేస్తుండడం ఏటా జరుగుతూనేవుంది. ఇదిలా వుండగా జిల్లా పౌరసరఫరాలసంస్థ కార్యాలయంలో రెండు వారాలుగా ఆడిట్ జరుగుతుండగా ఈ ప్రక్రియలో భారీగా అవినీతి బయటపడుతున్నట్లు తెలుస్తోంది. ప్రత్యేకించి పౌరసరఫరాలసంస్థకు సంబంధించిన గోడవున్ల అద్దెలు..ధాన్యం రవాణా చేసే వాహనాలకు చెల్లించాల్సిన అద్దెలు, పెట్రోల్, డీజిల్ తదితరాలలో ఈ అవినీతి జరిగినట్లు ఆడిట్ సిబ్బంది గుర్తించడం గమనార్హం. 2020-21 ఆర్థిక సంవత్సరానికి సంబంధించే ప్రస్తుతం జరుగుతున్న ఆడిట్‌లో ఇప్పటికే రూ. కోట్లాది రూపాయల నిధులు పక్కదారి పట్టినట్లు తెలుస్తోంది.

**ఔట్‌సోర్సింగ్ ఉద్యోగే పాత్రదారి..?**

పౌరసరఫరాలసంస్థ జిల్లా మేనేజర్ కార్యాలయంలో అకౌంట్‌సెక్షన్‌లో పనిచేస్తున్న ఓ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగే ఈ భారీ అవినీతికి పాత్రదారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. అయనతోపాటు జిల్లాలో పౌరసరఫరాలసంస్థకు చెందిన ఓ స్టేజ్-2 కాంట్రాక్టర్‌కు కూడా ఇందులో భాగస్వామ్యం వున్నట్లు తెలుస్తోంది. నెట్‌బ్యాంకింగ్ ద్వారా రూ.కోట్లాది రూపాయల నిధులను పంపాల్సినవారికి కాకుండా ఆ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగి తన బంధువులకు, స్నేహితుల అకౌంట్లకు పంపినట్లు ఆడిట్ సిబ్బంది గుర్తించడం గమనార్హం. అకౌంట్ సెక్షన్‌కు సంబంధించి ప్రత్యేకంగా ఒక అసిస్టెంట్ మేనేజర్ ఆ పైనా జిల్లా మేనేజర్ వున్నప్పటికీ వారు ఈ అవినీతి భాగోతాన్ని సంవత్సరాలుగా పట్టించుకోకపోవడం విమర్శలకు..అనుమానాలకు తావిస్తోంది. రాష్ట్ర పౌరసరఫరాలసంస్థ మేనేజింగ్ డైరక్టర్-వైస్‌చైర్మన్ వీరప్యాండన్, కమీషనర్ అరుణ్‌కుమార్‌లు గత నెల నెల్లూరుకు వచ్చిన విషయం విదితమే. అంతకు ముందురోజు నుండే జిల్లా పౌరసరఫరాసంస్థ కార్యాలయంలో ఆడిట్ జరుగుతుండడం అది ఇప్పటికీ కొనసాగుతుండడం గమనార్హం. మేనేజింగ్ డైరక్టర్-కమీషనర్‌లు వచ్చి వెళ్ళిన మరుసటి రోజే ఈ అవినీతి భాగోతం బయపడగా జిల్లా మేనేజర్ కలెక్టరేట్ ఆవరణంలోని బ్యాంక్‌కు వెళ్ళి నిర్ధారణ చేసుకున్నట్టు తెలుస్తోంది. ప్రతి అంశంలోనూ అవినీతి జరిగినట్లు నిర్ధారణ చేసుకున్న ఆడిట్ సిబ్బంది ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఎప్పటికప్పుడు ఆ రికార్డులను విజయవాడకు పంపుతూ తర్వాత రికార్డులను ఆడిట్ చేస్తుండడం గమనార్హం. సదరు ఔట్‌సోర్సింగ్ ఉద్యోగి 2007లో ఉద్యోగంలో చేరగా ప్రస్తుతం 2020-21 ఆర్థిక సంవత్సరానికి సంబందించే ఆడిట్ జరుగుతున్న నేపథ్యంలో 2007 నుండి ఆడిట్ జరిగితే ఇంకెంత నిధులు పక్కదారి పట్టాయో వెలుగులోకి వచ్చే అవకాశం వుంది.

**తప్పు చేసిన ఎవరినీ వదలం...జేసీ కూర్మనాధ్**

కాగా జిల్లా పౌరసరఫరాలసంస్థ కార్యాలయం వేదికగా జరిగిన అవినీతిపై జాయింట్ కలెక్టర్ రోణంకి కూర్మనాధ్‌ను వివరణ కోరగా ఆడిట్ సిబ్బంది ప్రాథమికంగా తమ నివేదికను రాష్ట్ర పౌరసరఫరాలసంస్థ మేనేజింగ్ డైరక్టర్‌కు పంపారన్నారు. జరిగిన అవినీతి-అవకతవకలపై పూర్తిస్థాయిలో విచారణ జరుపుతున్నామన్న ఆయన తప్పు చేసిన ఏ ఒక్కరినీ వదిలే ప్రసక్తే లేదన్నారు.

# వాల్మీకి రామాయణం అజరామరం



**నెల్లూరు కలెక్టరేట్, అక్టోబరు 9 ప్రభాతవార్త** మహర్షి వాల్మీకి రచించిన రామాయణ అజరామరమని..సమాజంలో ఎదుటివారితో ఎలా మెలగాలో తెలియజేసే అపురూపకావ్యం రామాయణమని జాయింట్ కలెక్టర్ రోణంకి కూర్మనాధ్ పేర్కొన్నారు. వాల్మీకిజయంతి పురస్కరించుకొని ఆదివారం కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణంలో జిల్లా బీసీ సంక్షేమశాఖ ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. వాల్మీకి మహర్షి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించిన జేసీ మనిషి తలుచుకుంటే ఎటువంటి పరివర్తన చెందవచ్చో వాల్మీకి మహర్షి జీవితం ద్వారా తెలుసుకోవచ్చన్నారు. వాల్మీకి రామాయణం అపురూప మహాకావ్యమని పేర్కొన్న ఆయన కార్పోరేట్ సంస్కృతితో కొట్టుమిట్టాడుతున్న నేటి భారతీయతను పరిరక్షించుకొనేందుకు రామాయణ మహాకావ్యంలో తెలిపిన విధంగా ప్రతి ఒక్కరూ జీవించాల్సివుందన్నారు. ఇచ్చిన మాటకు కట్టుబడి ఎటువంటి కష్టాలు ఎదురైనా నెరవేర్చాలని రామాయణం చెబుతోందన్న జేసీ ఆ విధంగా ధర్మాన్ని పరిరక్షించేందుకు అందరూ పాటుపడాలన్నారు. సమాజంలో ఎదుటివారితో ఎలా మెలగాలో రామాయణం చెబుతోందన్న ఆయన రామాయణ విశిష్టతను ప్రతి ఒక్కరూ తెలుసుకొని ఆచరించేందుకు ప్రయత్నించాలన్నారు. రామ అనే పదంలోనే అనేక అర్థాలు గోచరిస్తాయన్న ఆయన నేటి యువత భారతీయ సంస్కృతి-సాంప్రదాయాలను తెలుసుకోవాల్సిన అవసరం ఎంతైనా వుందన్నారు. కార్యక్రమంలో పాల్గొన్న వాల్మీకి అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు వెంకటేశ్వర్లు, అష్టావధాని, రిటైర్డ్ ప్రిన్సిపాల్ జనార్ధన్, రిటైర్డ్ ప్రొఫెసర్ డాక్టర్ మాలకొండయ్యలు వాల్మీకి గురించి వాల్మీకి రచించిన రామాయణం గురించి వివరించారు. మానవజీవితాన్ని సంస్కరించగల మహాకావ్యం రామయణమని పేర్కొన్న వారు జీవితంలోని అన్ని పార్శ్వాలను ఆ గ్రంథం స్పృశిస్తుందన్నారు. అందరూ కలిసిమెలిసి వుండాలన్న కుటుంబ జీవన విధానం గురించి, సంక్షేమ రాజ్యాన్ని అందించడమే పాలకుల లక్ష్యమన్న విషయాన్ని రామాయణం నొక్కి చెబుతుందన్నారు. కళాదీప్తి డ్యాన్స్ అకాడమీ విద్యార్థినులు చేసిన నృత్య ప్రదర్శనలు ఆహుతులను ఆకట్టుకున్నాయి. జిల్లా బీసీ సంక్షేమశాఖాధికారి వెంకటయ్య, సాంఘిక సంక్షేమశాఖ డిప్యూటీ డైరక్టర్ రమాదేవి, పశుసంవర్ధకశాఖ జాయింట్ డైరక్టర్ డాక్టర్ మహేశ్వరుడు, సమగ్రశిక్ష ఏపీడీ ఉషారాణి, బీసీ సంఘనేతలయిన దేవరాజు సుబ్రమణ్యం, వెంకటసుబ్బయ్య, అంకయ్య పాల్గొన్నారు.

# మినగల్లు ఆర్‌బికె కేంద్రాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే ప్రసన్న



**బుచ్చి అక్టోబర్ 9 ప్రభాతవార్త** బుచ్చిరెడ్డిపాళెం మండలంలోని మినగల్లు గ్రామంలో అట్టహాసంగా ఆర్‌బికె కేంద్రాన్ని కోవూరు శాసనసభ్యులు నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి ప్రారంబించారు.అనంతరం జరిగిన సభలో ఆయన మాట్లాడుతు కోవూరు నియోజకవర్గంలో 82 ఆర్‌బికె బిల్డింగ్‌లు మంజూరు చేయించడం జరిగిందని అన్నారు. ముఖ్యమంత్రి వ్యవసాయానికి పెద్ద పీట వేశారని ఆయన ప్రశంసించారు. సచివాలయ వ్యవస్ధ,వాలింటరీ వ్యవస్ధ అద్భుతంగా పనిచేస్తున్నాయని అన్నారు. దేశ చరిత్రలో సువర్ణాక్షరాలతో లికించే విధంగా ముఖ్యమంత్రి సంక్షేమ,అభివృద్ధి పధకాలు మంజూరుచేస్తున్నారని అన్నారు. జగన్‌మోహన్‌రెడ్డి లాంటి వ్యక్తి ప్రధానమంత్రి ఈదేశం బాగుపడుతుందని అన్నారు. ప్రతి గ్రామంలో ప్రతి కుటుంబం సంక్షేమపథకాలలో లబ్ధిపొందివుందని అన్నారు.గడపగడపకు కార్యక్రమానికి విశేష స్పందన లభిస్తుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో మూడో విడత చేయూత కార్యక్రమంలో భాగంగా 8 కోట్లా 88 లక్షలా 8 వేలు చెక్కును పొదుపు మహిళలకు ఎపిఎం ద్వారా అందజేశారు.

**జొన్నవాడలో గడపగడపకు కార్యక్రమం**

మండలంలోని జొన్నవాడ గ్రామంలో గడగడపకు కార్యక్రమాన్ని నిర్వహించారు.ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రకటించిన విధంగా సచివాలయానికి వచ్చిన 20 లక్షల రూపాయాల నిధులతో సైడు డ్రైన్‌లు నిర్మాణానికి శంకుస్ధాపన చేశారు. అలాలే ఎన్‌ఎస్‌ఆర్ ట్రస్టు తరపున 30 మంది గిరిజనులకు 10 వేల వంతున నగదు నాయకుల ద్వారా అందజేశారు.70 మందికి ఒటిఎస్ పత్రాలు అందజేశారు.అలాగే 30 మందికి ఇళ్ల స్ధలాల పట్టాలు అందజేశారు.ఈకార్యక్రమంలో ఎన్‌డిసిసి బ్యాంకు చైర్మన్ వీరిచలపతిరావు, అగ్రికల్చర్ జాయింట్ డైరక్టర్ వ్యవసాయ మార్కెంటింగ్ చైర్మన్ దొడ్డంరెడ్డి నిరంజన్‌బాబురెడ్డి, తహసిల్దారు ప్రమీల,ఎంపిడిఒ నరసింరావు, జొన్నవాడ దేవస్దానం చైర్మన్ పుట్టా సుబ్రమణ్యంనాయుడు, ఎంపిపి మన్నెపల్లి శ్రీనివాసులు, ఇప్పగుంట విజయ్‌భాస్కర్‌రెడ్డి ,మండల ఉపాధ్యాక్షురాలు నాగిరెడ్డి కీర్తనారెడ్డి,సర్పంచ్ బొర్రు పూజిత ,మినగల్లు నాయకులు పిడుగు మధు,నాగేశ్వరస్వామి ఆలయం చైర్మన్ నాగిరెడ్డి ద్వారకనాద్‌రెడ్డి, అల్లం నారయ్య,దాసరి హరి ,చెల్లాయపాళెం నాయకులు మురళీ,వెంకయ్య,సుధాకరయ్య, మల్లికార్జున, జొన్నవాడ నాయకులు మండల ఉపాధ్యాక్షులు ఎన్ బాలకృష్ణా, పి .మురళీ,సాగర్,పెనుబల్లి సర్పంచ్ ఓడా పెంచలయ్య,కోవూరు మార్కెటింగ్ డైరక్టర్ జొన్నవాడప్రసాద్,తదితరులు పాల్గోన్నారు.

## పోటాపోటీగా దసరా గ్రామోత్సవాలు



**మనుబోలు, అక్టోబరు 9 ప్రభాతవార్త** మనుబోలు, కోదండరామపురం సెంటర్‌లలో రెండు చోట్ల దసరా ఉత్సవాలు ఆదివారం ఉదయంతో ముగిసాయి. ప్రతి ఏట మాదిరిగానే ఈ సంవత్సరం కూడా కరోనా అనంతరం దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు సందడిగా జరిగాయి. 9 రోజుల పాటు మనుబోలు, కోదండరామపురం సెంటర్‌లలో అమ్మవారి అలంకరణలు భక్తుల్ని ఆకట్టుకున్నాయి. ఈ నేపథ్యంలో చివరిగా శనివారం రాత్రి 11 గంటల నుండి మహంకాళి అలంకరణతో గ్రామోత్సవాలు నిర్వహించారు. మనుబోలులో అమ్మవారి గ్రామోత్సవం ముందు ఇందూరు గ్రామ మహిళలచే కోలాటం, డిస్కో, తప్పెట్లు,మంగళ మేళం, బాణాసంచా శబ్దాలతో రాత్రంగా ఊరేగించారు. అలాగే కోదండరామపురం వీధి నుంచి అమ్మవారిని ఊరేగించారు. ఈ సందర్భంగా డిస్కో, తప్పెట్లు,మంగళ మేళం అలరించాయి. కోదండరామపురంకు చెందిన బాబు, లలితమ్మ దంపతుల కుమార్తె పూజిత మహిషాసుర మర్దిని నృత్యం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. అలాగే చైతన్య అనే యువకుడు శ్రీరామచంద్రుని దసరా అవతారంలో కనిపించాడు. వేకువజాము నుండి ఉన్నపళంగా వర్షం కురిసినప్పటికీ అమ్మవారి ఊరేగింపును కొనసాగించారు. దసరా ఉత్సవాల కోసం ఇక్కడ పెద్దఎత్తున స్టాల్స్‌ను ఏర్పాటు చేయడం విశేషం.

## మహిళ అని చూడకుండా దుష్ప్రచారం చేయడం తగదు



**కావలి రూరల్, అక్టోబరు 9 ప్రభాతవార్త** రాష్ట్ర విశ్వబ్రాహ్మణ సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్న నీరజను మహిళ అని కూడా చూడకుండా దుష్ప్రచారం చేయడం మంచి పద్ధతి కాదని విశ్వ బ్రాహ్మణ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు తిరుపాల్ ఆచారి, రాష్ట్ర జాయింట్ సెక్రటరీ పేట విజయ్ ఆచారి హెచ్చరించారు. కావలిలో ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. నెల్లూరు జిల్లా విశ్వబ్రాహ్మణ సంఘం అధ్యక్షులు జానా వెంకట శేషయ్య ఆచారి ఒక మహిళ అయిన నీరజపై తప్పుడు ప్రచారం చేయడం సరైన పద్ధతి కాదన్నారు. మహిళలు సంఘ సేవ చేయడానికి వచ్చినప్పుడు అభినందించి ప్రోత్సహించాల్సి పోయి సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారం చేయడం ఎంతవరకు సమంజసమన్నారు. ఒక జిల్లా అధ్యక్షుడు స్థానంలో వుండి ఈ విధంగా ప్రచారం చేయడం ఏమిటని వారు ప్రశ్నించారు. సంఘం రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ చేవూరి రామస్వామిని కూడా కించపరిచే విధంగా మాట్లాడటం సమంజసం కాదన్నారు. నీరజకు ఎవరు సపోర్టు చేసి మాట్లాడినా వారిని బెదిరించడం సరికాదన్నారు. ఈ బెదిరింపుల దోరణిని రాష్ట్ర సంఘం తీవ్రంగా ఖండిస్తుందన్నారు.జానా వెంకట శేషయ్య 46 మండలాలు సపోర్టు వుందని చెప్పి 11 మండలాలను పిలిచి అధ్యక్షులుగా చెలామణి అవుతున్నారన్నారు. నెల్లూరు జిల్లాలో ఎన్ని మండలాలు సపోర్టు వుందో తెలపాలన్నారు. జిల్లాకి నేనే అధ్యక్షుడిని మా పనులు మేము చేసుకుంటాం మాకు రాష్ట్ర సంఘంతో పనిలేదు అని అనడం ఎంతవరకు సమంజసమన్నారు. జిల్లా అధ్యక్ష స్థానంలో వుండి ఇలాంటి పరిస్థితులు సృష్టించడం ఏమిటని వారు ప్రశ్నించారు. మీరు చేసే తప్పుడు పనులకు మండలాల సహకారం వుందని జిల్లా కార్యవర్గం సహకారం వుందని తెలియజేశారని ఇప్పుడు మండలాల వారు కానీ ఈ విషయం మాకు తెలియదని చెబుతున్నారని తెలిపారు. నీరజపై దుష్ప్రచారాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో విశ్వబ్రాహ్మణ సంఘం మండలాల అధ్యక్షులు ఉదయగిరి సుబ్రమణ్యం ఆచారి, దుత్తలూరు హరిప్రసాద్, వింజమూరు రవీంద్ర, వరికుంటపాడు వీరాచారి, కావలి హరీష్ ఆచారి, కలిగిరి ఆదిమూల హరి, మర్రిపాడు రత్నాచారి, శ్రీనివాసాచారి, బుచ్చిసుబ్బారావు ఆచారి, సంగంశివరా మయ్య ఆచారి, ఎస్ఆర్‌పురం వెంకటేశ్వర్లు, సభ్యులు శ్రీనివాసాచారి, గౌరిశంకర్, వెంగయ్య ఆచారి, తదితరులు పాల్గొన్నారు.

## పేకాటస్థావరంపై దాడి - 6మంది అరెస్ట్

**ఆత్మకూరు,అక్టోబర్9 ,ప్రభాతవార్త**: నేర నివా రణా చర్యలో భాగంగా ఎప్పటికప్పుడు మెరుగైన సమాచార వ్యవస్థను ఏర్పాటు చేసుకున్న ఆత్మ కూరు ఎస్ఐ శివశంకర్‌రావ్ ఎక్కడికక్కడ వాటి నివారణా చర్యలు చేపడుతున్నారు. ఆదివారం బోయిళ్ళ చిరువెళ్ళలో పేకాట స్థావరంపై దాడు లు నిర్వహించారు. పేకాట ఆడుతున్న ఆరుమం దిని , వారి నుం డి 3100రూపాయలు నగదును స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ పై అధి కారుల సూచనలమేరకు ప్రతి గ్రామంలో అసాంఘిక కార్యక్రమాల పట్ల ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశామ న్నారు. ఎలాంటి అసాంఘిక కార్యక్రమాలు నిర్వహించిన వాటిని వెంటనే తెలుసుకొని కేసు నమోదు చేస్తామ న్నారు. నేరగాళ్ళు తమ నేర ప్రవృత్తిని మానుకోవాలని ఈసందర్భంగా వారు తెలిపారు.

## కమ్మపాళెంలో ఘనంగా పోలేరమ్మ పొంగళ్ళు



**జలదంకి,అక్టోబర్9,ప్రభాతవార్త:** సంస్కృతి సాంప్రదాయాలకు పట్టుకొమ్మలు పల్లె సీమలు,గ్రామాలలో దేవతామూర్తుల ప్రతిష్టలు,జాతరలు ఏదిజరిగినా ఆది ప్రతిగడపకూ పండుగే అన్నట్లుగా సాగుతుంది పల్లెజీ వనంలో ఆధ్యాత్మిక చింతన అంటే ఇక చెప్పేదేముంది.అందులో భాగంగానే జలదంకి పంచాయతీ పరిధిలోని కమ్మపాళెం ఆశోభతో మరోమారు మెరిసింది.గతనెలలో గ్రామ దేవత పోలేరమ్మ విగ్రహ ప్రతిష్ఠ,బొడ్డు రాళ్ళ స్తాపన వంటివి గొట్టిపాటి కొండపనాయుడు ఆధ్వర్యంలో సాంప్రదాయ బద్దంగా జరిగాయి.మండల పూజలు అనంతరం తిరిగి అమ్మవారి పొంగళ్ళు ఆదివారం నిర్వహించారు.సాంప్రదాయ బద్దంగా నియమనిష్టలతో ఊరిపడమట శివార్లలో వున్న అమ్మవారి దేవాలయానికి మేళ,తాళాలు,బాణాసంచా పేలుళ్ళు,గణాసారులు చిందులతో ఊరేగింపుగా కదిలారు.గుడిచుట్టూ తిరిగి కాయాకర్పూరం సమర్పించారు.నైవేద్యం పెట్టారు .మొక్కులు తీర్చుకొని అమ్మవారి కృపతకు పాత్రులైనారు.తీర్థప్రసాదాలు స్వీకరించారు.మధ్యాహ్నం వేళ భారీ అన్నదాన కార్యక్రమం చేపట్టారు.బంధువులు,స్నేహితులు,అయినవారినందరిని ఆహ్వానించి రాత్రివేళ విందులు వడ్డించి సాంప్రదాయాన్ని చాటుకున్నారు.ఈవేడుకతో గ్రామంఎంతో కళ,కళ లాడింది ఉత్సవాన్ని చూచి తరించిన భక్త జనం ఔరా అంటూ కొనియాడడం కనిపించింది.

## రీసర్వే మరింత వేగవంతం కావాలి



**కోవూరు, అక్టోబర్ 9 ప్రభాతవార్త** : కోవూరు మండలంలోని పోతి రెడ్డి పాలెం గ్రామంలో జరుగుతున్నజ గనన్న భూహక్కు-భూసర్వే కార్య క్రమ కంప్యూటర్ నమోదు కా ర్యక్రమాన్ని ఆదివారం తహసీల్దార్ ఎం. పద్మజ పరిశీలించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈసర్వే కార్యక్రమం వలన రైతు లకు సంబంధించిన భూవివరాలు పారదర్శకంగా నమోదవుతా య న్నారు. ప్రస్తుతం మండలంలోని మోడేగుంట, లేగుంటపాడు గ్రామాల్లో సర్వే కార్యక్రమం పూర్తిగా నమోదైం దని, మిగిలిన గ్రామాల్లో ఈ కార్యక్రమం కొనసాగుతుందన్నారు. రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ రాకేష్, సర్వేయర్ శ్రీనివాసులురెడ్డి, గ్రామ రెవెన్యూ అధికారులు ఉన్నారు.

## మహర్షి వాల్మీకి జీవితం ఆదర్శనీయం



**కోవూరు,అక్టోబం9 ప్రభాతవార్త :** రామాయణ మహాకావ్యాన్ని రచించిన మహర్షి వాల్మీకి జీవితం ఎందరికో ఆదర్శప్రాయమని కోవూరు ఎంపీడీవో శ్రీహరి అన్నారు. కోవూరులోని మండల పరిషత్ సమావేశ మందిరంలో వాల్మీకి జయంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన వాల్మీకి మహర్షి జీవితం ద్వారా మనిషి తలుచుకుంటే ఎటువంటి మార్పు చెందవచ్చునో రుజువు చేసిన మహనీయుడు ఆయనే అన్నారు. రామాయణ మహాకావ్యాన్ని అతి సుందరంగా రచించిన మహర్షి ఆయనే అన్నారు. ఈ కార్యక్రమంలో కార్యాలయ పర్యవేక్షకులు చం ద్రశేఖర్, కార్యాలయ సిబ్బంది కళ్యాణ్, సుబ్బారావు, విజయ్ , తదితరులు ఉన్నారు.

## పొట్టె షావలి దర్గాలో మిలాద్ ఉన్ నబీ వేడుకలు



**కావలి, అక్టోబరు 9 ప్రభా తవార్త** కావలి పట్టణం ట్రంకురోడ్డులోని పొట్టె షావలి దర్గాలోమిలా దినబి పండుగ వేడుకలు ఆదివారం ఘనంగా జరి గాయి. స్వామి వారికి ప్రత్యేక ప్రార్ధనలు నిర్వహిం చారు. అన్నదాన కార్యక్ర మం చేశారు. ఈ కార్య క్రమంలో షేక్ నసీర్‌బాయి, హ్యాపీ సేవా సంస్థ అధ్య క్షులు సయ్యద్ ఘనీ బాషా,షేక్‌ఖాదర్‌బాషా(ఇట్టు), పాల్గొన్నారు.

## బాలాజీ క్లీనిక్ ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం



**సంగం అక్టోబర్ 9 ప్రభాతవార్త** సంగం మండలం అన్నారెడ్డిపాళెం గ్రామంలోని పల్లిపాళెం ప్రాథమిక పాఠశాలలో బుచ్చిరెడ్డిపాళెం శ్రీబాలాజీ క్లీనిక్ ఆధ్వ ర్యంలో డాక్టర్ ఎస్ సుబ్రమణ్యం ఉచిత మెగా వై ద్యశిబిరం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు ఉచిత శిబిరాల ద్వారా మారుమూల గ్రామాలలో కూడా నిరుపేదలకు ఉచిత వైద్యశిబిరంద్వారా వైద్యం అందించనున్నట్లు ఆయనతెలి పారు. వైద్యపరీక్షల అనంతరం రోగులకు ఉచి తంగా మందులు పంపిణి చేసి పలు సూచనలు ఇచ్చారు.ఈకార్యక్రమంలో హాస్పటల్ సిబ్బంది పాల్గొన్నారు.

## శాకాంబరి అలంకారంలో గంగమ్మ



కోవూరు,అక్టోబం9 ప్రభాతవార్త : కోవూరులోని ప్రధాన రహదారిలో వెలసి ఉన్న గంగమ్మ దేవస్థానంలో పౌర్ణమి పర్వదినం సందర్భంగా అమ్మవారు శాకాంబరి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకులు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఉభయకర్తలుగా ప్రముఖ కాంట్రాక్టర్ దండి శ్రీనివాసులు దంపతులు వ్యవహరించారు. ఈ కార్య క్రమంలో రమేష్ యాదవ్, తదితరులు ఉన్నారు.

## ఘనంగా విష్ణు సహస్రనామ పారాయణం



కోవూరు,అక్టోబం9 ప్రభాతవార్త : కోవూరులోని కోదండరామస్వామి దేవస్థానంలో ఆదివారంపౌర్ణమి పర్వదినాన్ని పురస్కరించుకుని భక్త బృందం విష్ణు సహస్రనామ పారాయణాన్ని సాంప్రదాయబద్దంగా భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారికి ఆలయ ప్రధాన అర్చకులు శ్రీకాంతాచార్యుల ఆధ్వర్యంలో అభిషేక పూజలను ఘనంగా చేపట్టారు. ఈ కార్యక్రమంలో భక్తులు పాల్గొన్నారు.

## ఓటుకు ఆధార్ అనుసంధానానికి సహకరించాలి



**కోవూరు, అక్టోబర్ 9 ప్రభాతవార్త :** ఓటుకు ఆధార్ అనుసంధానం కార్యక్రమాన్ని ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు నిర్వహిస్తు న్నామని, ఇందుకు ఓటర్లు అయిన ప్రజలు స్వచ్ఛందంగా సహకరించాలని తహసీల్దార్ ఎం. పద్మజ తెలిపారు. ఆదివారం ఓటుకు ఆధార్ అనుసంధాన కార్యక్రమ ప్రత్యేక క్యాంపులను మండలంలోని అన్ని పోలింగ్ కేంద్రాల్లో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కోవూరు నియోజకవర్గానికి సంబంధించి మొత్తం ఓటర్లు 2,63,283 గానూ ఇప్పటివరకు 1,20,392 ఓట్లకు ఆధార్ అనుసంధాన ప్రక్రియ పూర్తిచేయడం జరిగిందన్నారు. ఈ పరిశీలనలో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ రాకేష్ , ఏఎస్‌వో చంద్రశేఖర్, సీనియర్ అసిస్టెంట్ ఉరూస్, తదితరులు ఉన్నారు.

## స్పాస్టిక్స్ సెంటర్ పిల్లలకు యూనిఫామ్స్ వితరణ



**నెల్లూరు అక్టోబర్ 9, ప్రభాతవార్త-వైద్యం** నగరంలోని ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ, ఎంఎస్ఆర్ స్పాస్టిక్స్ సెంటర్‌లో ఉన్న పిల్లలకు యూనిఫామ్స్‌ను, ఉపాధ్యాయని, ఉపాధ్యాయులకు కుర్చీలను లయన్స్ క్లబ్ డిస్ట్రిక్ట్ గవర్నర్ రామచంద్ర, కార్యదర్శి సుబ్రమణ్యంలు రెడ్‌క్రాస్ కోశాధికారి సురేశ్‌కుమార్ జైన్, మేనేజింగ్ కమిటీ సభ్యుడు దాసరి.రాజేంద్రప్రసాద్‌లకు అందించారు. ఈ సందర్భంగా రామచంద్ర ప్రకాష్ స్పాస్టిక్స్ సెంటర్ పిల్లలకు వారి సంస్థ తరపున సహాయం చేయడం చాలా ఆనందంగా ఉందన్నారు. అనంతరం స్పాస్టిక్స్ సెంటర్ సిబ్బందిని సన్మానించారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ఆఫ్ పినాకిని అధ్యక్షుడు నల్లూరి.కిరణ్, కార్యదర్శులు ఐవి.రామకృష్ణ, పివి.సునీల్‌కుమార్, రెడ్‌క్రాస్ కార్యదర్శి మస్తానయ్య, ఏటచంద్రశేఖర్, స్టేట్ కోఆర్డినేటర్ జివి.రవికుమార్, రెడ్‌క్రాస్ స్పాస్టిక్స్ సెంటర్ సిబ్బంది పాల్గొన్నారు.

## బహుజన రాజ్య స్థాపనే ధ్యేయం



**నెల్లూరురూరల్, అక్టోబరు9 ప్రభాతవార్త** బహుజన రాజ్య స్థాపనే ధ్యేయంగా ప్రతి నాయకుడు, కార్యకర్త కృషి చేయాలని బియస్పీ జిల్లా అధ్యక్షులు, రూరల్ నియోజకవర్గ సమన్వయకర్త బి.శ్రీరామ్ పిలుపు నిచ్చారు. ఆపార్టీ వ్యవస్థాపకులు కాన్షీరాం 16వ వర్ధంతిని పురస్కరించుకుని ఆదివారం నెల్లూరురూరల్ మండలం వెల్లంటి, సజ్జాపురం, గొల్లకొందుకూరు, కందమూరు, సౌత్‌మోపూరు, ఆమంచర్ల గ్రామాల్లో మోటార్‌సైకిల్ ప్రదర్శన నిర్వహించారు. కాన్షీరాం చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా నిర్వహించిన సభలో ఆయన మాట్లాడుతూ, కాన్షీరాం ఆశయాలు ఆదర్శం కావాలన్నారు. బహుజనులు రాజకీయ చైతన్యవంతులు కావాలని సూచించారు. కాన్షీరాం త్యాగాలను స్మరించారు. బియస్పీ రూరల్ నాయకులు ఇండ్ల శివయ్య, పెంచలప్రసాద్, జయరావు, వినయ్, తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## వైభవంగా నెలతలియ



**కోవూరు,అక్టోబరు9 ప్రభాతవార్త** కోవూరులోని బుద్ధి వారి వీధిలో వెలసి ఉన్న శ్రీ రామలింగ చాముండేశ్వరి మహాదేవి దేవస్థానంలో ఆదివారం నెలతలియ కార్యక్ర మాన్ని ఆలయ ప్రధాన అర్చకులు, రుత్వికుల పర్య వేక్ష ణలో సాంప్రదాయ బద్దంగా భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈకా ర్యక్రమాన్ని పురస్కరించుకుని ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలను చేపట్టారు. చుట్టుపక్కల ప్రాంతాల నుంచి భక్తులు పాల్గొన్నారు.

## సుల్తానే మదీనా మసీదులో రక్తదాన శిబిరం



**కావలి, అక్టోబరు 9 ప్రభాతవార్త** కావలి పట్టణం తుఫాన్‌నగర్‌లో సుల్తానే మదీనా మసీదు ఆవరణలో కమిటీ నిర్వాహకులు మిలాద్-ఉన్-నబి పర్వదినం సందర్భంగా ఆదివారం రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ఈ రక్తదాన శిబిరంలో 50 మంది హిందూ, ముస్లిం సోదరులు రక్తదానం చేశారు. ముస్లిం పెద్దలు, రక్తదాన ప్రేరేపకులు,వాయిస్ ఆఫ్ ముస్లిం మైనార్టీ సంస్థ వ్యవస్థాపకులు మొగల్ సలీంబేగ్ 23వ సారి రక్తదానం చేశారు. కరిముల్లా 11వ సారి రక్తదానం చేశారు. ఈ కార్యక్రమంలో రెడ్‌క్రాస్ సంస్థ ప్రతినిధులు గంధం ప్రసన్నాంజనేయులు, పద్మావతి రవిప్రకాష్, కమిటీ బాధ్యులు దస్తగిరి, అబ్దుల్ సమద్, వసీం అక్రమ్, కాలేషా, ముజిబ్ ఉర్ రెహ్మాన్, యిస్మాయిల్, షాజహాన్, తదితరులు పాల్గొన్నారు.

## పండుగ శుభాకాంక్షలు తెలిపిన టిడిపి నేత



**కందుకూరు,అక్టోబర్9,ప్రభాతవార్త** కందుకూరు పట్టణంలో మిలాద్-ఉన్-నబీ పండుగ ఉత్సాహంగా జరుపుకున్నారు. మహ్మద్ ప్రవక్త జన్మదిన్నాన్నిపురస్కరించుకుని ఆదివారం పలువురు ముస్లింలు ఈ పండుగ వేడుకలను నిర్వ హించారు.ఇందులో భాగంగానెల్లూరు పార్లమెంట్ టిడిపి ఉ పాధ్యక్షుడు ఇంటూరి రాజేష్ స్వయంగా ముస్లిం కుటుం బాల వద్దకు వెళ్లి వారికిశుభాకాంక్షలు తెలి పారు.మహ్మద్‌ప్రవక్త ప్రవచనాలు సర్వ మానవాళికి,జీవన .శైళికి హితోపదేశాలన్నారు.ప్రతి ముస్లింలు మహ్మద్ ప్రవక్త పట్ల ప్రేమా,గౌరవాలు చూపించాలనికోరారు.చూపించిన అడుగుజాడల్లో నడవాలని ఆకాంక్షించారు.తెలుగుదేశం ప్రభుత్వం ముస్లింలకు అండగా నిలిచిందని చెప్పారు.ఆయన మైనారిటీలందరికీ శుభాకాంక్షలు తెలిపారు.ఆయన వెంట ఎస్‌కె ఖాదర్,షేక్.కరిముల్లా,ఖుర్దూస్,నజీర్,రసూల్,నిషాత్,అమాన్ తదితరులు ఉన్నారు

CLASSIFIEDS

CHANGE OF NAME
★ I, KOTA SULOCHANAMMA, W/o Kota Narasaiah, residing at Dno: 26-2-2116, 3rd street, jyothi nagar, Nellore, AP hereby inform that I am having a Reliance Life Insurance Policy bearing No. 19659094 in Mumbai Branch. In said policy my Name and DOB were incorporated as Sulochana Kota and 01-01-1963 respectively. Hence I have to Change my name as KOTA SULOCHANAMMA and DOB as 03-10-1965 as per Aadhar Card and PAN Card.
(Ro.No.30860)

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగినరీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో "వార్త" దినపత్రికకు ఏ విధమైన సంబంధం లేదు.

## పూర్వ విద్యార్థుల అపూర్వ సమ్మేళనం



**నెల్లూరు అక్టోబర్ 9 ప్రభాతవార్త-విద్య** ఏసి నగర్ మున్సిపల్ పాఠశాలలో 1986-87 విద్యాసంవత్సరం పదవతరగతి చదివిన విద్యార్థిని విద్యార్థులు తమ పాఠశాల గురువులకు పాదాభివందనం చేసి ఘనంగా సత్కరించారు. ఈ అపూర్వ సమ్మేళనంలో పూర్వ విద్యార్థులు పాల్గొని తమ సంతోషానందాలను వ్యక్తం చేశారు. ఆదివారం స్థానిక త్యాగరాయ కల్యాణమండపంలో జరిగిన ఈ పూర్వ విద్యార్థుల సమ్మేళనానికి అప్పటి ఉపాధ్యాయులు, తోటి విద్యార్థులతో హాజరయ్యారు. అందరి సహకారంతో సమాజసేవకు శ్రీకారం చుడుతూ ఒ విద్యార్థినికి ఆమె చదువుల కోసం ఆర్థిక సాయమందించారు. ఉపాధ్యాయులు గురునాథం, దుర్గాదేవి, అచ్చయ్య, హితవచనం తదితరులు పాల్గొని తమ ఆనందాన్ని విద్యార్థులతో పంచుకున్నారు.

## సిపిఐ జాతీయ మహాసభల వాల్‌పోస్టర్ల ఆవిష్కరణ



**కందుకూరు,అక్టోబర్9,ప్రభాతవార్త** ఈ నెలలో సిపిఐ జాతీయ మహాసభలు జరుగనున్న నేపథ్యంలో ఆదివారం ఆ పార్టీ నేతలు వాల్‌పోస్టర్లుఆవిష్కరించారు.స్థానిక ప్రశాంతి నగర్‌లో సిపిఐ వాల్‌పోస్టర్లను ఆవిష్కరించడం జరిగింది.నియోజకవర్గ కార్యదర్శిబి.సురేష్‌బాబు మాట్లాడుతూ ఈ నెల 24న విజయవాడలో జాతీయస్థాయి మహాసభలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.ఇందులో భాగంగా సీపిఐ నాయకులు ప్రజల్లో విస్తతంగా పర్యటిస్తున్నట్లు చెప్పారు.47సంవత్సరాలతర్వాత ఆంధ్రప్రదేశ్‌లో ఈ జాతీయ మహాసభలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.వీటికి ఎంతో ప్రాముఖ్యత ఉన్నట్లు పేర్కొన్నారు.దేశ విదేశాల నుంచి కమ్యునిస్టు నాయకులు హాజరుకానున్నట్లు చెప్పారు.ఈ కార్యక్రమంలో నత్తా రామారావు,దాసరి సింగయ్య,నత్తా మహేష్,నవీన్ తదితరులు పాల్గొన్నారు.

## చెరువు గట్టుపై యువకుడి మృతదేహం



**కందుకూరు, అక్టోబర్9,ప్రభాతవార్త** లింగసముద్రం మండలం తిమ్మారెడ్డిపాలెంకు చెందిన ఓ యువకుడు ఆదివారం వేకువజామున మృతిచెందినట్లుపోలీసులు తెలిపారు. చెరువు గట్టుపై మృతదేహం పడిఉండటాన్ని గమనించిన వారు లింగసముద్రం పోలీసులకు సమాచారం అందించారు.ద్విచక్ర వాహనంపై వస్తూ ప్రమాదం జరిగి పడిపోయిఉంటారని అనుమానిస్తున్నారు.తిమ్మారెడ్డిపాలెంకు చెందిన కేశంరెడ్డి రమేష్(27) అనే వ్యక్తి శనివారం మాలకొండకు వెళ్లారు.అక్కడి కంప్యూటర్‌ఆపరేటర్‌గా ఇటీవలే జాయిన్ అయ్యారు.తదుపరి ఇంటికి వస్తూ మార్గమధ్యంలో ద్విచక్ర వాహనం నుంచి పడి పోయారని చెప్పారు.చెరువు గట్టుపై బండిపై పడ్డారని అక్కడ ఉన్నవారు చూసి స్థానిక ప్రభుత్వ వైద్యశాలకుతీసుకుని వెళ్లగా అప్పటికే మృతిచెందినట్లు పోలీసులు వెల్లడించారు.కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు లింగసముద్రం పోలీసులు తెలిపారు.

## నాగేశ్వరరావుని పరామర్శించిన చేజర్ల



**నెల్లూరు అక్టోబర్ 9, ప్రభాతవార్త-వైద్యం** రిటైర్డ్ మేల్ నర్సింగ్ ఆర్డర్లీ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు ఎం.నాగేశ్వ రరావు గత కొంతకాలంగా కిడ్నీ సంబంధిత వ్యాధితో మంచానికే పరిమితమై ఇ బ్బంది పడుతున్న ఆయనను నగరంలోని హరనాథ పురంలో ఉన్న ఆయన నివాసం లో ఆదివారం హంస (హెల్త్ అడ్మినిస్ట్రేషన్ మెడికల్ సర్వీ సెస్ అసోసియేషన్) జిల్లా అధ్యక్షుడు చేజర్ల సుధాకర్‌రావు, పలువురు ఉద్యోగ సంఘ నాయకులు పరామర్శించి, ఆయన ఆరోగ్య పరిస్థితి గురించి తెలుసుకున్నారు. వారి ఆరోగ్యం మెరుగవుతుందని ఆయన కుటుంబసభ్యులకు ధైర్యం చెప్పారు. ఈ కార్యక్రమంలో జిల్లా మేల్ నర్సింగ్ ఆర్డర్లీ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు వినోద్‌కుమార్, జిల్లా వైస్ ప్రెసిడెంట్ సుబ్రమణ్యం, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## పీటర్‌పాల్ చర్చిలో పాస్టర్లడే వేడుకలు



**కావలి, అక్టోబరు 9 ప్రభాతవార్త** జాతీయ పాస్టర్ల దినోత్సవాన్ని పురస్కరించుకొని కావలి పట్టణ వెంగళరావునగర్‌లోని పీటర్‌పాల్ చర్చిలో ఆదివారం పాస్టర్ల డే వేడుకలు ఘనంగా జరిగాయి. చర్చిల పా స్టర్లు రెవ.బలుసు జోసఫ్, పాడేటి థామస్‌లను పీటర్‌పాల్ మినిస్ట్రీస్ కమిటీ సంఘ నాయకులు దుశ్శా లువతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో చర్చి కమిటీ నాయకులు సురేష్.సాల్మన్, యోహాన్, డైరెక్టర్, ఫౌండర్, ఛైర్మన్ దేవరకొండ సుధీర్‌బాబు ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్ధనలు, వేడుకలు జరిగాయి.

## మాదిగలను ఓటు బ్యాంకుగా వాడుకునే వారికి గుణపాఠం నేర్పాలి



**నెల్లూరు టౌన్, అక్టోబర్09, ప్రభాతవార్త:** ఎన్నికల సమయంలో మాత్రమే మాదిగలు రాజకీయ పార్టీలకు గుర్తుకు వస్తున్నారని , ఓటు బ్యాంకుగా వాడుకుని ఎన్నికలు ముగియగానే ఇచ్చిన హామీలను విస్మరించే రాజకీయ పార్టీలకు మాదిగలు తగిన గుణపాఠం నేర్పాలని సీమాంధ్ర ఎమ్మార్పీఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంటు పందింటి సుబ్బయ్య మాదిగ కోరారు. అంబేద్కర్ భవన్‌లో ఆదివారం ఆయన ఎమార్పీఎస్ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో మాట్లాడారు.

## కావలి ఒకటవ పట్టణ సిఐగా బాధ్యతలు చేపట్టిన శ్రీనివాసరావు



**కావలి, అక్టోబరు 9 ప్రభాతవార్త** కావలి ఒకటవ పట్టణ సర్కిల్ ఇన్స్పెక్టర్‌గా కొండవీటి శ్రీనివాసరావు ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. ప్రకాశం జిల్లా పామూరు నుంచి ఆయన కావలికి వచ్చారు. ఈసందర్భంగా మీడియాతో మాట్లాడారు. ప్రజలకు పోలీసులు జవాబుదారితనంగా వుండేలా పాటుపడతామన్నారు. ప్రజలకు ఏ సమస్య వచ్చినా వెంటనే తనకు కానీ పోలీస్ స్టేషన్‌కు కానీ సమాచారం అందజేస్తే స్పందించి న్యాయంచేస్తామన్నారు. కావలి పట్టణ ట్రంకు రోడ్డులో ట్రాఫిక్ సమస్యను క్రమబద్ధీకరించేందుకు చర్యలు చేపడతామన్నారు. పోలీస్ కమాండెంట్ కార్యాలయ పరిధిలో పట్టణంలో ఏర్పాటు చేసిన సిసి కెమెరాలు పనిచేయడం లేదనితెలిసిందన్నారు. పోలీస్ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి కెమెరాలుకూడా పనిచేసేలా చర్యలు చేపడతానన్నారు.ఫ్రెండ్లీ పోలీస్ వాతావరణాన్ని ప్రజలకు కల్పిస్తామన్నారు.

## జోరువానలో గడపగడపకు కార్యక్రమం



**కందుకూరు, అక్టోబర్9, ప్రభాతవార్త** కందుకూరు శాసనసభ్యుడు మానుగుంట మహీధర్‌రెడ్డి గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎండా,వాననుసైతం లెక్కచేయకుండా విధిగాపాల్గొంటున్నారు. గత రెండు రోజుల నుండి జోరుగా వర్షం పడుతున్నా ఆయన కార్యక్రమాన్ని వాయిదా వేసుకోలేదు.ఉదయం 7గంటలకల్లా ఇంటి ముందులవాలుతున్నారు.ఆదివారం జోరున వర్షం పడుతున్నా గొడుగు పట్టుకుని ఇంటింటికి తిరిగారు.కందుకూరు మండలం కమ్మవారిపాలెం,బలిజపాలెంలో వర్షం సైతం లెక్కచేయకుండా ఇంటింటికి వెళ్లిఅవ సరాల ను గుర్తించి ప్రజలతోమాట్లాడారు.సంక్షేమ పథకాల అమలు తీరును అడిగి తెలుసుకున్నారు.ప్రతి కుటుం బాన్ని ఆప్యాయంగా పలకరిస్తూ సంక్షేమ పథకాలను వారికి వివరిస్తున్నారు.ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి సంతకం చేసిన పుస్తకాన్ని అందజేస్తున్నారు.విరామం లేకుండా ఆయన వర్షం సైతం లెక్క చేయకుండా మండల అధికారులను వెంటబెట్టుకుని రెండు గ్రామాలలో విస్తృతంగాపర్యటించారు.ఈ సందర్భంగా లబ్ధిదారులతో ఎమ్మెల్యే మాట్లాడుతూ పేదప్రజల సంక్షేమం కోసం ప్రభుత్వంకట్టుబడిఉందని స్పష్టం చేశారు.కరోనా కష్టకాలంలో సైతం ఈ ప్రాంతంలో ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాలుఅందే విధంగా తాను కృషి చేసినట్లు పేర్కొన్నారు.అమ్మఒడి,వైయస్సార్ ఫించన్ కానుక,చేయూత,ఆరోగ్యశ్రీ,వాహనమిత్రా,వసతి దీవెన,విద్యాదీవెన,పేదలందరికీ ఇళ్లు తదితర అంశాలపై ఆయన లబ్ధిదారులకు వివరించారు.ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేతో పాటు తహశీల్దార్ సీతారామయ్య, ఎంపిడివో విజయశేఖర్,ఎంపీపీ,జడ్పీటీసీ సభ్యులు,పలువురు వైయస్సార్‌సీపి సభ్యులు పాల్గొన్నారు.

## గొలగమూడికి శ్రీసాయిభక్త బృందం మహా పాదయాత్ర



**నెల్లూరు అక్టోబర్ 9 ప్రభాతవార్త-** హరనాధపురం శ్రీసాయిదర్బార్ అద్దాల సాయిబాబా మందిరం ఆధ్వర్యంలో సాయి మాలలు ధరించిన సాయి భక్తులు ఆదివారం మందిరం నుండి గొలగమూడి శ్రీభగవాన్ వెంకయ్య స్వామి వారి సన్నిధి వరకు మహా పాదయాత్ర నిర్వహించారు. పెద్దసంఖ్యలో సాయి భక్తులు సాయి దర్బార్ వద్దకు చేరుకుని స్వామివారికి ప్రత్యేక పూజల అనంతరం కాషాయ వస్త్రాలు, జెండాలతో గొలగ మూడికి పయనమయ్యారు. ఆద్యంతం భక్తులు సాయినామ సంకీర్తనలు, ఓం నారాయణ ఆదినా రాయణ భజనలు, కోలాట నృత్యాలతో కోలా హలంగా గొలగమూడి వరకు పాదయాత్ర చేశారు. వెంకయ్యస్వామిని దర్శించుకున్న అనంతరం గొలగమూడి మాడవీధుల్లో ప్రదక్షణలు చేసి స్వామివారికి పట్టువస్త్రాలు, నైవే ధ్యాలను సమరించి మొక్కులు తీర్చుకున్నారు. సాయిధర్బార్ చైర్మన్ మధుసాయి మాట్లాడుతూ సాయి మాలధారణ చేసిన భక్తులు పాదయాత్రలో పాల్గొనడం జరిగిందన్నారు. బాబా అనుగ్రహం ప్రతిఒక్కరిపై ఉండాలన సంకల్పంతో యాత్ర నిర్వ హించామని, గొలగమూడి వెంకయ్య స్వామి వారి కృపాకటాక్షాలు అందరిపై ఉండాలని ఆయన ఆకాంక్షిచారు. ఈకార్యక్రమంలో మందిర గౌరవ సలహాదారులు పోబోలు రామసుబ్బయ్య, శ్రీసాయిదర్బార్ సత్సంగ సేవాధళ్ సభ్యులు పాల్గొన్నారు.

## వైసిపి తీర్థం పుచ్చుకున్న చెల్లాయపాళెం సర్పంచ్



**బుచ్చి అక్టోబర్ 9 ప్రభాతవార్త** బుచ్చిరెడ్డిపాళెం మండలంలోని చెల్లాయపాళెం గ్రామ సర్పంచ్ రజనీకాంత్ ,మరికొంతమంది వైసిపిలో చేరారు.పార్టీలో చేరిన వారిని కోవూరు శాసనసభ్యులు నల్లపరెడ్డి ప్రసన్న కుమార్‌రెడ్డి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు గతంలో పార్టీలో ఉన్న వారు కొత్తగా పార్టీలో చేరిన వారు అందరు సమన్వయంతో పనిచేసి పార్టీ అభివృద్ధికి కృషి చేయాలని ఆయన సూచించారు.సీనియర్ నాయకులు యర్రంరెడ్డి గోవర్ధన్‌రెడ్డిని ఆయన అభినందించారు. చిన్న పొరబాటు జరిగిందని వవ్వేరు బ్యాంకు చైర్మన్ సూరా శ్రీనివాసులురెడ్డికి ఆయన ప్రత్యేకంగా సారి చెప్పారు.ఈకార్యక్రమంలో ఎన్‌డిసిసి బ్యాంకు చైర్మన్ వీరిచలపతిరావు, వ్యవసాయ మార్కెటింగ్ చైర్మన్ దొడ్డంరెడ్డి నిరంజన్‌బాబురెడ్డి,జొన్నవాడ దేవస్థానం చైర్మన్ పుట్టా సుబ్రమణ్యంనాయుడు, ఎంపిపి మన్నెపల్లి శ్రీనివాసులు,మినగల్లు ఎంపిటిసి సభ్యురాలు నాగిరెడ్డి కీర్తనారెడ్డి,సర్పంచ్ బొర్రు పూజిత ,మినగల్లు నాయకులు పిడుగు మధు,నాగిరెడ్డి ద్వారకనాద్‌రెడ్డి,చెల్లాయపాళెం నాయకులు మురళీ,వెంక య్య, సుధాకరయ్య, తదితరులు పాల్గొన్నారు.

## కలువాయిలో టిడిపి సర్వసభ్య సమావేశం



**కలువాయి అక్టోబర్ 9 ప్రభాతవార్త** కలువాయి తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఆదివారం పార్టీ మండలాధ్యక్షులు గోనుగుంట వెంకటేశ్వర్లు నాయుడు ఆధ్వర్యంలో మండస్థాయి సర్వసభ్య సమా వేశాన్ని నిర్వహించారు. ఈకార్యక్రమానికి పార్టీనాయకులు,క్లస్టర్ ఇన్‌చార్జిలు,యూనిట్ ఇన్‌చార్జిలు,బూత్ కన్వీనర్లు,పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు. మండలంలో పార్టీని బలోపేతం చేయాలని వెంకటేశ్వర్లునాయుడుసూచించారు.అదే విధంగా ఎంఎల్‌సి ఎన్నికల చేర్పులు గురించి ఆయన నాయకులు, కార్యకర్తలతో చర్చించారు.పార్టీ మండలస్థాయి నాయకులు పాల్గొన్నారు.

## పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



**బుచ్చి అక్టోబర్ 9 ప్రభాతవార్త** బుచ్చిరెడ్డి పాళెం పట్టణంలోని స్థానిక డిఎల్‌ఎన్‌ఆర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 1996-97 సంవత్సరాలలో ఐదవ తరగతి చదివిన విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం నిర్వ మించారు.గురువుల తమ పట్ల చూపిన ఆదరణకు పూర్వ విద్యార్థులకు ప్రత్యే కంగా కృతజ్ఞతలు చాటుకున్నారు.గురు వులు విజయలక్ష్మి, శివజ్యోతి, యా ని,మాణిక్య మ్మ, బేగం,జయ బాల,ఫజు లాలి, రామిరెడ్డి, టి .వెంక టేశ్వర్లు, నరసింహారావు, భాస్క ర్,బాల కేశవులు, గాయత్రి, వెంకటేశ్వర్లు,కొండయ్య, యన్ వెంకటేశ్వర్లు, హిందీమేడంబేగం, డిఎల్‌ఎన్‌ఆర్ పాఠశాల ప్రధానోపాధ్యాయులు నాగ పద్మలకు పూలమాలలతో శాలువాలు కప్పిసత్కరించారు. మెమోంటోలు అందజేశారు.కనుకనే పూర్వ విద్యార్థులందరు ఉన్నత పదవుల్లో ఉన్నా రని కొనియాడారు. భవి ష్యత్తులో ఇంకా ఉన్నత పదవులు అధిరోహించాలని ఆశీర్వదించారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులందరు కళాశాల గురించి ఎంతో గొప్పగా వారి పూర్వ అనుభవాలు పాఠశాలలో చదువుకోవడం వల్ల వారు ఎంత ఉన్నత పదవులు పేరు ప్రఖ్యాతలు గాంచారో గుర్తు చేసుకున్నారు . అందరు కలిసి సహపంక్తి బోజనం చేశారు. అప్పటి ఉపాధ్యాయులు,పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

## ఉద్యోగుల సహనాన్ని పరీక్షించొద్దు



**నెల్లూరు కలెక్టరేట్, అక్టోబరు 9 ప్రభాతవార్త** ఉద్యోగుల సహనాన్ని పరీక్షించవద్దని..మరోసారి ఛలో విజయవాడ వంటి కార్యక్రమానికి తమను దిగనీ యవద్దని ఆంధ్రప్రదేశ్ రెవెన్యూ సర్వీసెస్ అసోసి యేషన్ (ఏపిఆర్ ఎస్ఏ) రాష్ట్ర అధ్యక్షులు-ఏపిజేఏసీ అమరావతి చైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు రాష్ట్ర ప్రభుత్వానికి హితవు పలికారు. ఏపిఆర్ఎస్ఏ నెల్లూ రుజిల్లా కార్యవర్గ సమావేశంలో పాల్గొనేందుకు ఆది వారం నెల్లూరుకు వచ్చిన ఆయన కలెక్టరేట్‌లోని సంఘ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన రాష్ట్రంలో ఉద్యో గులకు సంబంధించిన ఆర్థిక, ఆర్థికేతర విష యాలను వరుసగా వివరిస్తూ ఆయా సమస్యల పరి ష్కరించకుండా ప్రభుత్వం కాలయాపన చేస్తోంద న్నారు. ప్రభుత్వం తమతో చెప్పేదొకొటిగా.. చేసే దొకటిగా వుందన్న ఆయన ప్రభుత్వ విధానాలతో ప్రభుత్వశాఖల మధ్య తమ మధ్య అంతరాలు వచ్చే పరిస్థితి ఏర్పడుతోందన్నారు. వేతన సవరణ (పీఆ ర్సీ) విషయంలో ప్రభుత్వం అందుకు సంబంధించి ఏర్పాటు చేసిన మంత్రులు-అధికారుల కమిటీతో ఉద్యోగసంఘ నాయకుల మధ్య జరిగిన చర్చలలో ఒప్పుకొని వ్రాత పూర్వకంగా ఇచ్చిన అంశాలను సైతం ప్రభుత్వం నేటికీ అమలుచేయలేదన్నారు. ఆర్థికేతర అంశాలను వెంటనే ప్రకటిస్తామని..ఆర్థిక అంశాలను ఒక్కొక్కటిగా పరిష్కరిస్తామని పేర్కొన్న ప్రభుత్వం ఆదిశగా నేటికీ అడుగులు వేయడం లేదన్నారు. ప్రభుత్వ ఉద్యోగుల వయోపరిమితిని 62 సంవత్సరాలకు పెంచిన ప్రభుత్వం గురుకుల పాఠ శాలల ఉద్యోగులు, కార్పోరేషన్లలో పనిచేస్తున్న ఉ ద్యో గులకు వయోపరిమితి పెంచలేదన్న బొప్పరాజు వెంకటేశ్వర్లు ఈ విషయమై తమకు హామీ ఇచ్చి అందుకు విరుద్ధంగా జీఓ విడుదల చేసిందన్నారు. సీపీఎస్ రద్దుపై ఉద్యోగ సంఘనాయకులను రాజ స్థాన్, ఛత్తీస్ ఘడ్ తీసుకువెళ్ళి ఆశ కల్పించిన రాష్ట్ర ప్రభుత్వం సీపీఎస్ రద్దు కుదరదని చెబుతుండడం దుర్మార్గంగా వుందన్నారు.ఇక కొత్త జిల్లాల హెడ్ క్వార్టర్లలో పనిచేసే ఉద్యోగులకు 16 శాతం హెచ్ఆ ర్ఏ ఇస్తామన్న ప్రభుత్వం ఆ విషయాన్నీ పట్టించుకో వడం లేదన్న ఏపిఆర్ఎస్ఏ రాష్ట్రనేత కారుణ్య ని యామకాల విష యంలోనూ మాట తప్పుతోందన్నారు. రాజకీయనేతలు, ఐఏఎస్ అధికారులు మర ణిస్తే వారి వారసులకు డిప్యూటీ కలెక్టర్ పోస్టులు ఇ స్తున్న ప్రభుత్వం ఉద్యోగులు మరణిస్తే వారి వా రసులకు గ్రామ-వార్డు సచివాలయాలలో ఉద్యోగాలి స్తామనడం ఎంత వరకు సమంజసమన్నారు. జీతాలే సక్రమంగా రావడం లేదు ఉద్యోగులకు ప్రస్తు తం జీతాలు తప్ప మరే ఇతరాలు రావడం లేదన్న బొప్పరాజు వెంకటేశ్వర్లు ఆ జీతాలు కూడా సకాలంలో ఇవ్వడం లేదన్నారు. రాష్ట్రంలో అక్టోబర్ నెలకు సంబంధించి ఉద్యోగులకు ఇవ్వాల్సి న జీతాలు-పెన్షనర్లకు ఇవ్వాల్సి న పెన్షన్లు నేటికీ పూర్తిగా ఇవ్వలేదన్నారు. ఇక ఉద్యోగులు దాచు కున్న జీపీఎ ఫ్, సరెండర్‌లీవ్ తదితరాలు రావడం లేదని..రిటైర్డ్ అయిన ఉద్యోగులకు రావాల్సి న బెనిఫిట్స్ అందడం లేదన్నారు. ఉద్యోగ ఉపాధ్యాయులకు సంబంధించి దాదాపు రూ. 15 వేల కోట్లు రావాల్సి వుం దన్న బొప్పరాజు వెంకటేశ్వర్లు రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగుందని స్వయానా ముఖ్యమంత్రి శాసనసభలో పే ర్కొన్న నేపథ్యంలో ఆయా బకాయిలన్నీ విడుదల చేయాలన్నారు. ఉద్యోగుల సహనాన్ని పరీక్షించవద్ద న్న ఆయన మరోసారి ఛలో విజయవాడ వంటి కార్యక్రమానికి ఉద్యోగులు దిగకుండా ప్రభుత్వం చూసుకో వాలన్నారు. ఉద్యోగులలో ఆగ్రహం పెల్లుబి కితే ఉద్యోగ సంఘనాయకులుగా తామేమీ చేయ లేమన్న ఆయన ఉద్యోగుల వెనుక తాము నడవా ల్సి న పరిస్థితి ఏర్పడుతుందన్నారు. కాగా ఈ సమా వేశంలో ఏపిఆర్ఎస్ఏ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, జిల్లాశాఖ అధ్యక్షకార్యదర్శులైన అల్లంపాటి పెంచలరెడ్డి, మురళి, సతీష్, అనిల్, శేషయ్య, డేనియల్, లక్ష్మి, ప్రదీప్, బాలకోటమ్మ తదితరులు పాల్గొన్నారు.

## మంత్రులకు చిత్తశుద్ధి ఉంటే రాజీనామా చేయాలి



**ఉదయగిరి అక్టోబర్ 9 ప్రభాతవార్త** మండలకేంద్రమైన ఉదయగిరిలోని చెం చలబాబుయాదవ్ అతిధి గృహంలో తెలుగుదేశం పార్టీ రాష్ట్ర మార్కెటింగ్ సెక్రటరీ పొన్నుబోయిన చెంచలబాబుయాదవ్ మాట్లాడుతు మూడు రాజ ధానుల కొరకుమాజీ మంత్రి ధర్మనప్రసాద్‌రావు రాజీనామాచేస్తానని ప్రక టించడం హాస్యస్పదం.ధర్మన ప్రసాద్‌రావుకి వారి మంత్రులకు సీమాంధ్ర ఎమ్మేల్యేలకు రాజదానిపట్ల చిత్తశుద్ధి ఉంటే వెంటనే రాజీనామా చేసి విశాఖ రాజధాని కొరకు ఉద్యమంచేయాలని కోరుతున్నట్లు తెలిపారు.విశాఖవాసులు,సీమాంధ్రప్రజలు తమకు విశాఖ రాజధాని అవసరం లేదని అమ రావతిని ఏకైక రాజధానిగా ఏర్పాటు చేయాలని వారి అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారని ,కాని మంత్రులు, ఎమ్మేల్యేలు వారి స్వార్ధ రాజకీయాల కోసం ప్రతి పక్షంలో ఉన్నప్పుడు అమరావతి రాజధాని ప్రకటించి 32 వేల ఎకరాలు సేకరిం చడం సమంజసమేనని తెలియజేశారు.ఇప్పుడు కేవల జగన్‌మోహన్‌రెడ్డి మెప్పుకోసం రాజీనామాలు చేస్తా మని డ్రామాలు చేస్తున్నారు.విశాఖపట్టణం రాజధాని కావాలని సీమాంధ్ర ప్రజలు ఎవ్వరు ఆందోళన చెందడం లేదు.కేవలం తన స్వార్ధం కోసం వైసిపి నాయకులు మాత్రమే విశాఖ రాజధాని కావాలని కోరుకుంటు న్నారు.ఆంధ్రరాష్ట్రంలో 5కోట్ల ప్రజల ఆకాంక్ష అమరావతని ఏకైక రాజధానిగా కోరుకుంటున్నా రు.ఇకనైనా డ్రామాలు మానుకొని ప్రజల కోరిక మేరకు అమరావతి రాజధానిగా అబివృద్ధి చేయాలని డిమాండ్ చేస్తున్నామని అన్నారు.

## కృష్ణ బలిజ కులాన్ని బిసి ఎగా మార్చేందుకు పాటుపడతా



**కావలి, అక్టోబరు 9 ప్రభాతవార్త** కృష్ణ బలిజ కులాన్ని బిసి డి నుండి బిసి ఎగా మార్చేందుకు తనవంతు సహకారం అందిస్తూ పాటుపడతానని ఈ విషయాన్ని మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు దృష్టికి తీసుకెళ్తానని తెలుగుదేశం పార్టీ కావలి నియోజకవర్గ ఇన్‌చార్జ్ మాలేపాటి సుబ్బానాయుడు తెలిపారు. కావలి పట్టణంలోని మన్నెం గోపాలకృష్ణారెడ్డి కళ్యాణమండపంలో ఆదివారం జరిగిన కృష్ణబలిజ సంఘం 6వ మహాసభ కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిధిగా పాల్గొని మాట్లాడారు. కృష్ణ బలిజ సంఘం ఐక్యతతో కొనసాగాలన్నారు. కావలిలో ఈ సంఘానికి కమిటీ హాలు ఏర్పాటుకు లక్ష రూపాయలు విరాళం అందజేస్తున్నట్లు ఆయన ప్రకటించారు. కృష్ణ బలిజ సంఘం నేతలు, టిడిపి నేతలు పాల్గొన్నారు.

## కేశవచౌదరికి పలువురి అభినందనలు



**చేజర్ల, అక్టోబర్9, ప్రభాతవార్త:** చేజర్ల మండలం నాగులవెలటూరుకు చెందిన దాత వేలూరు కేశవచౌదరిని ఆది వారం పలువురు అభినందించారు. కేశవ చౌదరి 48వ జన్మదినోత్సవం సందర్భంగా నాగులవెలటూరులో వేడుకలు నిర్వహించారు. ఆత్మకూరు మాజీ శాసనసభ్యులు కొమ్మిలక్ష్మయ్యనాయుడు మాట్లాడుతూ ఆపదలో ఉన్నవారిని ఆదుకునేందుకు తానున్నానంటూ ముం దుకు వస్తున్న కేశవచౌదరి ధాతృత్వం అభినందనీ యమన్నారు. చేజర్ల, కలువాయి, పొదలకూరు , నెల్లూరు, సంగం ప్రాంతాలనుంచి పెద్ద ఎత్తున కేశవచౌదరి అభిమానులు పాల్గొని కేక్ కట్‌చేయడంతోపాటు బొకేలు , శాలువాలతో ఘనంగా సత్కరించారు. అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈసందర్భంగా కేశవచౌదరి మాట్లాడుతూ తనకు దేవుడిచ్చిన శక్తిమే రకు తనకు అవకాశం ఉన్నంతవరకు సేవా కార్యక్రమాలను చేస్తుంటానన్నారు. ఈకార్యక్రమంలో ఆయన సతీమణి వేలూ రు రేవతి, టిడిపి జిల్లా యువత అధ్యక్షుడు కాకర్ల తిరుమలనాయుడు, టిఎన్‌ఎస్‌ఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఎస్.కె.అమ్ముల్లా, టిడిపి పార్లమెంటరీ అధికార ప్రతినిధి రావిపెంచలరెడ్డి, మండల టిడిపి అధ్య క్షుడు రావి లక్ష్మీనరసారెడ్డి, బిసి సెల్ అధ్యక్షులు చీర్ల వెంకటేశ్వర్లు, నాగులవెలటూరు సర్పంచ్ షేక్ మస్తాన్ , పార్టీలకతీతంగా జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి అభిమానులు హాజరయ్యారు.

## వ్యాపారస్తులకు శిరసాభివందనాలు



**బుచ్చి అక్టోబర్ 9 ప్రభాతవార్త** బుచ్చిరెడ్డిపాళెం నగరపాలక పంచాయితీలో చెనూ న్నరు రోడ్డు ఆక్రమణలు తొలగించేందుకు సహకరించిన వ్యాపారస్తులందరికి శిరస్సు వచ్చి వారికి పాదాభివందనాలు చేస్తున్నట్లు చైర్‌పర్సన్ మోర్ల సుప్రజ తెలిపారు. బుచ్చి రెడ్డిపాళెం చెన్నూరురోడ్డుకి డ్రైన్స్‌కి,రోడ్డు నిర్మాణానికి కోవూరు శాసనసభ్యులు నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి 2 కోట్లు మంజూరు చేయించారని ఆమె తెలిపారు .పెరుగుతున్న ట్రాఫిక్‌కి అణుగుణంగా చెనూ న్నరురోడ్డుని కోవూరు శాసనసభ్యులు నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి సహాయ సహకారాలతో అభివృద్ధి చేయాలని ఆక్రమణలు తొలగించడం జరి గిందని ఆమె తెలిపారు.రోడ్డులో ఆక్రమణలు తొలగించే సమయంతో ఎంతో సమన్వయంతో వ్యవహారించిన వ్యాపారవర్గాల వారికి ఆమె ప్రత్యేకంగా ధన్యవాదాలుతెలిపారు. అధికారులకు,ఆయా పార్టీ నాయకులకు, పోలీసులకు ఆమె ప్రత్యేకంగా కృతజ్ఞతలు చెప్పారు. చెన్నూరు రోడ్డును అన్ని విధాలా అభివృద్ధి చేయను న్నట్లు ఆమె తెలిపారు.

## చేజర్లలో మిలాద్-ఉన్-నబీ వేడుకలు



**చేజర్ల, అక్టోబర్9, ప్రభాతవార్త:** చేజర్లలో ఆదివారం మిలాద్-ఉన్-నబీ వేడుకలు ఘనంగా జరిగాయి. చేజర్లకు చెందిన ముస్లిం సోదరులంతా కలసి మసీదు వద్ద అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ముస్లిం మైనార్టీ నాయకులు షేక్ శిరాజుద్దీన్ ఆధ ్వర్యంలో జామియా మసీద్ ముతావళి షేక్ మస్తాన్‌సాహెబ్ ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం మహ్మద్ ప్రవక్త , అల్లా పేరులమీద అన్నదానాలు చేశారు. ఈకార్యక్రమంలో ముస్లిం మైనార్టీ నాయకులు నజీర్ ,కాలేషా, దావూద్, ఇస్మాయిల్, ఆర్.కె.రసూల్, అక్బర్, హాజీ ఖాదర్‌బాషా, షాబాద్ షంషుద్దీన్, రసూల్ తదితరులు పాల్గొన్నారు.

## అమ్మవారి నామస్మరణలో భవానీ స్వాములు భిక్షాటన



**కలువాయి అక్టోబర్ 9 ప్రభాతవార్త** జైదుర్గా... జైజై దుర్గా... అంటు అమ్మవారి నామస్మరణతో కలువాయి గ్రామంలోశ్రీదుర్గాభవానీ మాలాధరణ ధరించిన భవానీస్వాములు భిక్షాటన కార్యక్రమాన్ని చేపట్టా రు.శ్రీకలువాయమ్మ తల్లి అమ్మవారి దేవస్థానం నందు మండల దీక్ష మాలాధరణ చేపట్టిశ్రీదేవి శరన్నవరాత్రి మహోత్సవాలలో భక్తి శ్రద్దలతో అమ్మవారి సేవా కార్యక్రమాలలో పాల్గొని విజయదశమి అనంతరం విజయవాడ కనకదుర్గమ్మ అమ్మవారి సన్నిధానం చేరుకొని అమ్మవారికిబందాలు సమర్పించి మొక్కులు తీర్చుకోవడం పరిపాటి ఇందులో భాగంగా గ్రామ సుభీక్ష కోసం3 రోజుల పాటు ఇంటింటికి వెళ్లి భవానీలు భిక్షలు స్వీకరిస్తారు.ఆదివారం పౌర్ణమి సందర్భంగా గ్రామ దేవత పంచామృతా భిషేకం,విశేషపూజలతోపాటు మధ్యాహ్నం పెద్దఎత్తు_న అన్న ప్రసాద వితరణ నిర్వహించారు.సాయింత్రం భజన కార్యక్రమాలతోపాటు అమ్మవారికి సేవ కార్యక్రమాలు నిర్వహించారు.గత 15 సంవత్సరాల నుండి అమ్మ వారి మాలాధరణ చేపట్టి అమ్మవారి సేవలో తరించడం వల్ల ఆదిశక్తి ఆశీస్సులు పొందుతున్నట్లు తెలిపారు.ఈనెల 12 వ తేది న విజయవాడకు వెళ్లనున్నట్లు భవానీ స్వాములు తెలిపారు.

## బయోడీజిల్ అక్రమ విక్రయంపై ఆర్‌డిఓ దాడి



**పొదలకూరు అక్టోబర్ 9 ప్రభాతవార్త** మండలకేంద్రమైన పొదలకూరులో బయోడిజిల్‌ని అక్రమంగా నిలువుంచుతు విక్రయిస్తున్న వారిపై ఆర్‌డిఓ మలోల ఆదివారం ఆకస్మికంగా దాడి చేసి నిర్వాహకుల్ని అరెస్టు చేశారు.నిలువవుంచిన బయోడీజల్‌ని స్వాధీనం చేసుకున్నారు. పట్టణంలో ఎటువంటి అనుమతులు లేకుండా అక్రమంగా బయోడీజల్ విక్రయిస్తారన్న సమాచారంతో ఆర్‌డిఓ ఆకస్మికంగా దాడి చేసి నిర్వాహకుల్ని అదుపులోకి తీసుకున్నారు.పొదలకూరు నుండి మనుబోలుకు వెళ్లే రహదారిలో ఒక రైసు మిల్లులో ఈ బయోడీజల్ విక్రయాలు జరుగుతున్నట్లుగా కనుగొనుడంతో ఈదాడులు చేశారు. ఈదాడులలో చెన్నై నుండి అక్రమంగా తరలించి నిలువవుంచిన 49 బ్యారీల బయోడీజల్‌తో సహా వాటికి ఉపయోగించే పలు సామాగ్రి సీజ్ చేశారు. దీని విలువ 8 లక్షల 56 వేల 5 వందల 20 రూపాయాలు విలువ వుండవచ్చునని అధికారులు అంచనావేశారు. 6ఎ కేసు నమోదు చేసినట్లు తెలిపారు. పట్టణంలో అక్రమంగా ఈ వ్యాపారాన్ని చాలా రోజుల నుండి గుట్టుగా రహస్యంగా విక్రయిస్తున్న వ్యక్తిని అదుపులోకి తీసుకొని విచారిస్తున్నట్లుగా అధికారులు తెలిపారు.ఈ దాడులలో నెల్లూరు డివిజనల్‌అసిస్టెంట్ సివిల్‌సప్లయ్ అధికారి రవిబాబు,తహసిల్దారు ప్రసాద్,ఆర్ఐ నవీన్,విఆర్ఓ సంధ్య, తదితరులు పాల్గొన్నారు.

## సిపిఐ24వ జాతీయ మహాసభలను జయప్రదం చేయండి



**మర్రిపాడు, అక్టోబర్9, ప్రభాతవార్త:** సిపిఐ 24వ జాతీయ మహాసభలను విజయవంతం చేయాలని మర్రిపాడు మండలంలోని నందవరం, డిసిపల్లి, రామానాయుడుపల్లి, రాంపల్లి, పొంగూరు, కంద్రిక, వడ్డిపాళెం, భీమవరం, ఇర్లపాడు, సన్నవా రిపల్లి తదితర గ్రామాల్లో సిపిఐ మండల నాయకుల ఆధ్వర్యంలో ఆదివారం జాతీయ మహాసభల పోస్టర్ల ద్వారా ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్రంలో ఉన్న బిజెపి ప్రభుత్వం తీసుకువచ్చిన రైతుల వ్యతిరేక చట్టాలను వ్యతిరేకిస్తూ బిజెపిని ఎండగట్టాలని అన్ని పార్టలు కలిసికట్టుగా ఈనెల 14నుండి 18వతేదీ వరకు విజయవాడలో జరిగే సిపిఐ 24వ జాతీయ మహాసభలకు పెద్ద సంఖ్యలో ప్రజలు, రైతులు తరలివచ్చి సభను జయప్రదం చేయాలని కోరారు. సిపిఐ మండల కార్యదర్శి షేక్ మహబూబ్‌బాషా,సిపిఐ మండల రైతుసంఘం అధ్యక్షుడు గంగినేని నారాయణ, మండల సహాయ కార్యదర్శి తలపనేని రాంసుబ్బయ్య, కార్యకర్తలు పాల్గొన్నారు.

## అక్రమ కేసులు బనాయిస్తే చూస్తూ ఊరుకోం



**బిట్రగుంట, అక్టోబరు 9 ప్రభాతవార్త** టిడిపి కార్యకర్తలపై అక్రమ కేసులు బనాయిస్తే చూస్తూ ఊరుకోమని కావలి నియోజకవర్గ టిడిపి ఇన్‌చార్జ్ మాలేపాటి సుబ్బానాయుడు హెచ్చరించారు. బిట్రగుంట పోలీస్ స్టేషన్‌లో ఆదివారం ఒక కేసు విషయమై కొండబిట్రగుంటలో అక్రమ కేసులు బనాయించి నాలుగు రోజుల నుంచి నిర్బంధించినందుకు నిరసనగా టిడిపి నేతలు, కార్యకర్తలతో ఆయన పోలీస్ స్టేషన్‌ను ముట్టడించి బైఠాయించారు. ఈ సందర్భంగా పోలీసులకు వ్యతిరేకంగా పోలీస్ జులుం నశించాలి, డౌన్‌డౌన్ పోలీస్ అంటూ నినాదాలు చేశారు.అనంతరం మాలేపాటి మాట్లాడారు. కొండబిట్రగుంటలో గత నాలుగు రోజుల క్రిందట జరిగిన కొట్లాటలో తమ కార్యకర్తలకు కూడా కొంత మందికి సంబంధం వుందని అయితే దీనిపైన కేసు నమోదు చేసినప్పటికీ కోర్టుకు హాజరుపర్చకుండా సంబంధం లేని వ్యక్తులను కూడా అదుపులోకి తీసుకొని సెక్షన్ 307 క్రింద కేసులు నమోదు చేయడం చట్టరీత్యా వ్యతిరేకమన్నారు. ఇది పోలీస్ స్టేషనా, వైసిపి కార్యాలయమా అని బిట్రగుంట ఎస్ఐ చినబలరామయ్యని సుబ్బానాయుడు నిలదీశారు. ఎల్లకాలం అధికార పార్టీకి తొత్తులుగా వ్యవహరించి అక్రమ కేసులు బనాయిస్తుంటే చూస్తూ ఊరుకోమని ఆయన హెచ్చరించారు. అధికార పార్టీ అరాచకాలకు అడ్డుఅదుపు లేకుండా పోయిందని తమ కార్యకర్తలకు అన్యాయం జరిగితే ఎవరు లేరని అనుకోవద్దని తమ పార్టీ కార్యకర్తలకు, నేతలకు అండగా వుంటామన్నారు. పోలీసులు చట్టం ప్రకారమే నడుచుకోవాలి కానీ రాజారెడ్డి రాజ్యాంగం ప్రకారం కాదన్నారు. అలా వ్యవహరించే వారికి రోజులు దగ్గర పడతాయని విమర్శించారు. బిట్రగుంట స్టేషన్ దగ్గర జరిగిన ఈ ఆందోళన విషయం తెలుసుకున్న కావలి రూరల్ సిఐ యం.రాజశేఖర్ టిడిపి నేతల్ని పిలిచి దీనిపై విచారణ జరిపి న్యాయం జరిగేలా చూస్తామని గొడవలలో పాత్ర వున్న వారిపై మాత్రమే చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో వారు ఆందోళనను విరమించారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు మాలేపాటి నాగేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి ఎల్.సుధీర్‌బాబు, నేతలు కోటా వెంకారెడ్డి, బడుగు వెంకయ్య, పైడి హర్ష, ఉప్పాల మాలకొండయ్య, పొత్తెళ్ల హరి, ఆవుల సురేష్, అన్నంగి ఆదిశేషయ్యతో పాటు పలు గ్రామాల నుంచి వచ్చిన 50 మంది నేతలు పాల్గొన్నారు.